DYNAMIC EDITION
# వాయిస్ టుడే
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 2
సోమవారం, నవంబరు 13, 2023


## ఐటీదాడుల కలకలం.. ఫార్మా కంపెనీల్లో తనిఖీలు..!

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ ఐటీ దాడులు కలకలం సృష్టిస్తున్నాయి. ఇటీవల పలువురు నాయకుల ఇళ్లల్లో సోదాలు జరిగిన విషయం తెలిసిందే. తాజాగా సోమవారం నుంచి నగంలోని పలుచోట్ల దాడులు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. దాదాపు 15 చోట్ల ఐటీ సోదాలు జరుగుతున్నాయి. ఇందులో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి బంధువుల ఇంట్లోనూ సోదాలు నిర్వహిస్తున్నారు. అయితే, ఐటీ అధికారులు ఈ సారి ఎక్కువగా ఫార్మా కంపెనీలే లక్ష్యంగా దాడులు జరుపుతున్నట్లు సమాచారం. ఆర్‌సీపురంలోని నాగులపల్లి, అమీన్‌పూర్‌లోని పటేల్‌గూడలో సోదాలు చేస్తున్నారు. అలాగే గచ్చిబౌలిలోని హైహోం భుజాలో తనిఖీలు సాగుతున్నాయి. ఫార్మా కంపెనీ డైరెక్టర్లు, బ్యాంకు వివరాలు, ఆర్థిక లావాదేవీలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్ నేతలు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, జానారెడ్డి, పారిజాత నరసింహారెడ్డి, కేఎల్ఆర్ నివాసాలపై దాడులు జరిగిన విషయం తెలిసిందే.



## మృతుల కుటుంబసభ్యులకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా

హైదరాబాద్ (వాయిస్ టుడే): నాంపల్లి బజార్‌ఘాట్ అగ్నిప్రమాద మృతుల కుటుంబాల తెలంగాణ ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చెప్పున ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు మంత్రి కేటీఆర్ ప్రకటించారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ ఘటనా స్థలికి చేరుకున్నారు. అక్కడి పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే గాయపడిన క్షతగాత్రులకు ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నామన్నారు. మెరుగైన వైద్యం కోసం అవసరమైతే ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలిస్తామని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

నాంపల్లిలోని బజారఘాట్ ఏరియాలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం ఉదయం 9.30 గంటలకు ఓ అపార్టుమెంటు గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒక్కసారిగా చెలరేగిన మంటలు ఐదు అంతస్తులకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో తొమ్మిది దుర్మరణం పాలయ్యారు. వారిలో కొందరు ఊపిరాడక ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు సజీవ దహనమయ్యారు. మృతుల్లో నలుగురు మహిళలు, ఒక నాలుగు రోజుల పసికందు ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు.

ఈ ప్రమాదంలో మరో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అపార్టుమెంటు ముందు పార్క్ చేసి ఉన్న ఒక కారు, ఆరు ద్విచక్రవాహనాలు కూడా ఈ ప్రమాదంలో దగ్ధమయ్యాయి. ప్రమాదం జరగగానే స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. ఫైర్ సిబ్బంది నాలుగు ఫైరింజన్‌ల సాయంతో మంటలను ఆర్పేశారు. అపార్టుమెంటులో చిక్కుకున్న 21 మందిని రెస్క్యూ సిబ్బంది సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు.

అపార్టుమెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఓ గ్యారేజీ ఉన్నదని, ఆ గ్యారేజీలో కారును రిపేర్ చేస్తుండగా మంటలు చెలరేగాయని మధ్యమండల డీసీపీ వేంకటేశ్వర్‌రావు తెలిపారు. గ్యారేజీ సమీపంలో డీజిల్, కెమికల్ డ్రమ్ములకు మంటలు అంటుకుని అపార్టుమెంటు పైఅంతస్థులకు వ్యాపించాయని చెప్పారు. అపార్టుమెంటు మూడు, నాలుగో ఫ్లోర్‌లలో అద్దెకు ఉండే కుటుంబాలు మంటల్లో చిక్కుకున్నాయన్నారు.

*- బజార్‌ఘాట్, వాయిస్ టుడే*



## అపార్టుమెంటులో ఘోర అగ్నిప్రమాదం..

# 9 మంది దుర్మరణం

అపార్టుమెంటు ఓనర్ రమేశ్ జైశ్వాల్‌కు కెమికల్ కంపెనీలు ఉన్నాయి. ఈ క్రమంలో అపార్టుమెంటు సెల్లార్‌లో అతను 130 డ్రమ్ముల కెమికల్‌ను నిలువచేశారు. పాస్టిక్ తయారీకి వినియోగించే ఈ కెమికల్ డ్రమ్మెల్లో 30 డ్రమ్ములకు మంటలు అంటుకుని పెద్ద ఎత్తున చెలరేగాయి. ఆలోపే ఘటనా ప్రాంతానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పుతూనే కాలిపోకుండా ఉన్న మిగతా డ్రమ్ములను బయటకు తీసుకొచ్చారు. కాగా, ప్రమాదం అనంతరం ఆపార్టుమెంటు ఓనర్ రమేశ్ జైశ్వాల్ పరారయ్యాడు. పరారీలో ఉన్న అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.





## ఎన్నికలంటే ఆగం కావొద్దు.. ఆలోచించి ఓటేయాలి..

### సీఎం కేసీఆర్

ఎన్నికలంటే ఆగం కావొద్దు.. ఆలోచించి ఓటేయాలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రజలకు పిలుపునిచ్చారు. అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేటలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మనకు స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తుంది. చాలా ముందుకు దూసుకుపోతున్న దేశాల్లో ప్రజాస్వామ్య పరిణితి వచ్చింది. మన దేశంలో ఇంకా కూడా రావాల్సినటువంటి పరిణి ఇంకా రాలేదు. ఎన్నికలు చాలా వస్తుంటయ్ పోతుంటాయ్. మీరు ఎన్నికల్లో చాలాసార్లు పాల్గొన్నారు. నేను మిమ్మల్ని ఒకటే కోరుతన్నా. ఎన్నికలు వచ్చాయంటే ఆగం కావొద్దు. నినాదంగా మంచీ చెడు ఆలోచించాలి. ఎన్నికలు వచ్చాయంటే పార్టీకి కొరు నిలబడుతరు. బీఆర్ఎస్ నుంచి నాగేశ్వర్‌రావు నిలబడ్డారు. కాంగ్రెస్, బీజేపీ నుంచి వేరేవాళ్లు నిలబడతారు. అన్నింటి కన్నా ముఖ్యంగా అభ్యర్థుల వెనుక పార్టీలు ఉన్నయ్. ఆ పార్టీల చరిత్ర, నడవడిక, ఆ పార్టీలకు అధికారం ఇస్తే ఏం ఆలోచిస్తారు.. బీదసాదల గురించి ఆ పార్టీల దృక్పథం ఏంటీ? ఆలోచన సరళి ఏంటీ అనే విషయం గ్రామాల్లో, పట్టణాల్లో చర్చ జరగాలి' అన్నారు.

## కన్నీటి వీడ్కోలు.. అంత్యక్రియలు పూర్తి!

ప్రముఖ నటుడు చంద్రమోహన్ అంత్యక్రియలు పూర్తయ్యాయి. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం ఉదయం అపోలో ఆస్పత్రిలో మరణించిన సంగతి తెలిసిందే! సోమవారం ఆయన అంత్యక్రియలు పంజాగుట్టలోని శ్మశాన వాటికలో జరిగాయి. చంద్రమోహన్ సోదరుడు మల్లంపల్లి దుర్గాప్రసాద్ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. తొలుత ఫిల్మ్‌నగర్‌లోని ఆయన నివాసం నుంచి అంతిమయాత్ర ప్రారంభమైంది. కుటుంబ సభ్యులు పలువురు సినీ ప్రముఖులు చంద్రమోహన్‌కు కడసారి వీడ్కోలు పలికారు. అభిమాన నటుడి కడసారి చూపు కోసం అభిమారులు భారీగా తరలివచ్చారు. అంతిమయాత్రకు ముందు పలువురు సినీ ప్రముఖులు చంద్రమోహన్‌కు నివాళులర్పించారు. వెంకటేశ్, రాజశేఖర్, జీవిత, నిర్మాత ఆదిశేషగిరిరావు, మాదాల రవి తదితరులు చంద్రమోహన భౌతికకాయం వద్ద అంజలి ఘటించారు.




## నాంపల్లి అగ్నిప్రమాదంపై సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి

హైదరాబాద్: నాంపల్లి భారీ అగ్ని ప్రమాదంపై ముఖ్యమంత్రి కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. తక్షణమే పటిష్టమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం ఆదేశాలు జారీ చేశారు. తీవ్రంగా గాయపడ్డవారికి మెరుగైన వైద్యం అందించాలని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారు.



# నేను మంత్రి కాకూడదా.. ఎందుకింత హేళన..!? : సీతక్క



హైదరాబాద్ (వాయిస్ టుడే): ములుగు కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "నన్ను ఓడించేందుకు రూ.200 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ములుగులో పోటీ చేస్తోంది నాగజ్యోతి కాదు.. కేసీఆర్, కేటీఆర్. దొంగ నోట్లు కూడా పంచుతున్నారు. గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. 'సీతక్క మంత్రి అవుతుందంట' అంటూ హేళన చేస్తున్నారు. బడుగు బలహీనవర్గాలు మంత్రులు కావద్దా?, ఇంకా దొరల చేతిలో బందీలుగా బతుకుదామా?, దొరల తెలంగాణ కావాలా..? ప్రజల వద్దకే పాలన అందించే కాంగ్రెస్ పార్టీ కావాలో ప్రజలే తేల్చుకోవాలి. మనకు ఇల్లు, పోడు భూములకు పట్టాలు, మన పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వని బీఆర్ఎస్ నేతలు మన ఇళ్లల్లోకి వస్తే తిరగబడండి.. తరిమి కొట్టండి" అని సీతక్క పిలుపునిచ్చారు.



# ఒకేరోజు రాహుల్ సహా అగ్రనేతలు ఎన్నికల ప్రచారం!

హైదరాబాద్: తెలంగాణ ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ అగ్ర నేతలంతా వచ్చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు రాహుల్, ప్రియాంక సహా పలువురి నేతలు ప్రచారం నిర్వహించారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ప్రచారం ఊపందుకుంటోంది. ఈనెల 17న రాహుల్‌గాంధీ తెలంగాణకి రానున్నారు. ఆరు రోజులు తెలంగాణలోనే రాహుల్ మకాం వేయనున్నారు. అలాగే 17 తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ ముఖ్యమంత్రులు కూడా విస్తృతంగా పర్యటించనున్నారు. ఇక ఒకే రోజు తెలంగాణలో రాహుల్, ప్రియాంక, ఖర్గే సమావేశాలు ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో వీఐపీ పర్యటనలు ఉండేలా కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. ఈనెల 17న పాలకుర్తి, వరంగల్, భువనగిరిలో రాహుల్ సభలు నిర్వహించనున్నారు.

# మంత్రి పువ్వాడ అఫిడవిట్ తిరస్కరించాలని ఈసీకి తుమ్మల ఫిర్యాదు

ఖమ్మం (వాయిస్ టుడే): బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజేయ్ అఫిడవిట్‌ను ఎన్నికల సంఘం తిరస్కరించాలని కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పువ్వాడ అజేయ్ అఫిడవిట్ సరైన ఫార్మెట్‌లో లేదని ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా తుమ్మల మీడియాతో మాట్లాడారు. "పువ్వాడ అఫిడవిట్ ప్రిస్క్రైబ్ ఫార్మెట్‌లో లేదు. ఫార్మెట్ మార్చడంపై రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశా. రిటర్నింగ్ అధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాం. రిటర్నింగ్ అధికారి తీరుపై న్యాయస్థానంలో ఫిర్యాదు చేస్తాం. ఎన్నికల సంఘం ఇచ్చిన ఫార్మెట్‌లో కాకుండా మార్చి ఇచ్చారు. అఫిడవిట్‌లో డిపెండెంట్ కాలమ్ మార్చారు. డిపెండెంట్ కాలమ్‌లో ఎవ్వరు లేకపోతే నిల్ రాయకుండా మార్చారు. నాలుగు సెట్స్ నామినేషన్లలో తప్పులు ఉన్నాయి. ప్రిస్క్రైబ్ ఫార్మెట్‌లో లేకపోతే నామినేషన్ రిజెక్ట్ చేయాలని రిటర్నింగ్ అధికారిని అడిగా. ఆర్వోపై న్యాయ పోరాటం చేస్తా. ఆర్వో ఎన్నికల నిబంధనలు పాటించలేదు." అని తుమ్మల ధ్వజమెత్తారు.

# 9మంది మృతి అత్యంత బాధాకరం.. అగ్నిప్రమాదంపై భట్టి



హైదరాబాద్ (వాయిస్ టుడే): నాంపల్లి బజార్‌ఘాట్ అగ్నిప్రమాదంపై సీఎల్పీ నేత భట్టి విక్రమార్క దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాంపల్లి బజార్ ఘాట్ అపార్ట్‌మెంట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 9 మంది మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలియజేశారు. అగ్ని ప్రమాదంలో గాయపడిన వారికి యుద్ధ ప్రాతిపదికన మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. అగ్ని ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అలాగే నాంపల్లి అగ్నిప్రమాద ఘటనను సందర్శించడానికి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఫిరోజ్ ఖాన్‌ను ఎంఐఎం కార్యకర్తలు అడ్డుకోవడాన్ని భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు.

# సీఈవోను కలిసిన బీఆర్ఎస్ లీగల్ టీం.. రేవంత్‌పై ఫిర్యాదు



హైదరాబాద్ (వాయిస్ టుడే): టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిపై సీఈఓ వికాస్ రాజ్‌కు బీఆర్ఎస్ లీగల్ టీం ఫిర్యాదు చేసింది. సోమవారం సీఈవోను బీఆర్ఎస్ లీగల్ బృందం కలిసింది. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని సీఈవోకు ఫిర్యాదు చేసింది. బీఆర్ఎస్‌ను కించపరిచే విధంగా ఉన్న కాంగ్రెస్ యాడ్స్‌ను ఆపాలని మరోసారి లీగల్ టీం ఫిర్యాదు చేసింది.

అనంతరం బీఆర్ఎస్ లీగల్ బృందం నేత సోమా భరత్ మాట్లాడుతూ.. పచ్చగా ఉన్న తెలంగాణను హింసాత్మకంగా చేసేందుకు ఎన్నికలకు ముందే కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హింసను ప్రేరేపించే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. క్యాడర్‌ను రెచ్చగొట్టే విధంగా రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. వారం రోజుల్లో దుబ్బాక, అచ్చంపేట ఘటనలు జరిగాయన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి ప్రభాకర్ రెడ్డి ఇప్పటికీ సీరియస్‌గానే ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యే అభ్యర్థులపై దాడులు జరిగితే రేవంత్ రెడ్డి కనీసం మానవత్వం లేకుండా మాట్లాడుతున్నారని విరుచుకుపడ్డారు. పదేళ్లుగా బీఆర్ఎస్ పాలనలో ఎక్కడైనా ఘటనలు జరిగాయా? అని ప్రశ్నించారు. ఇప్పుడు జరుగుతున్న ఘటనలు ఎవరి వల్ల జరుగుతున్నాయో ప్రజలు ఆలోచన చేయాలన్నారు. రేవంత్‌కు టీడీపీ తల్లిపార్టీ అయితే... కాంగ్రెస్ అత్తపార్టీ అంటున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి టీడీపీ పార్టీ అంతర్గత ఒప్పందం కుదిరిందని వ్యాఖ్యలు చేశారు. స్టార్ క్యాంపెనియర్‌గా ఉన్న రేవంత్ రెడ్డి భాష పద్ధతిగా ఉండాలని హితవుపలికారు. ఎంసీసీ కమిటీకి చూపించిన యాడ్స్ ఒకటి.. బయట ప్రచారం మరొకటి చేస్తున్నారన్నారు. ఏదైనా కన్ఫ్యూజన్ ఉన్న అంశాలపై ఈసీ స్పష్టత ఇస్తే బాగుంటుందని సోమా భరత్ అభిప్రాయపడ్డారు.

# కమలానికి గుడ్‌బై చెప్పి కారెక్కిన తుల ఉమ




హైదరాబాద్ (వాయిస్ టుడే): బీజేపీకి తుల ఉమ గుడ్‌బై చెప్పి గులాబీ గూటికి చేరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో ఆమె పార్టీలో చేరారు. కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. నాలుగు రోజులుగా సాగుతున్న హైడ్రామాకు తెరపడింది. బీజేపీ టికెట్ ఇచ్చినట్టే.. ఇచ్చి వెనక్కి తీసుకుంది. దీంతో ఆమె కమలం పార్టీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అనంతరం అనేక పార్టీల నుంచి ఆహ్వానాలు వచ్చాయి. కానీ చివరికి ఆమె కారెక్కారు. తొలుత వేములవాడ బీజేపీ టికెట్ తుల ఉమకే కేటాయించారు. చివరి నిమిషంలో మాత్రం అంతా తారుమారైపోయింది. బీఫామ్ ఇవ్వకుండా పార్టీ నిరాశ పరిచింది. ఈ పరిణామంతో ఆమె షాక్ అయ్యారు. తుల ఉమకు కాకుండా మరొకరికి కేటాయించింది. ఈ సంఘటనతో ఆమె తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. అనుచరులతో సమావేశాల అనంతరం ఆమె బీఆర్ఎస్‌లో చేరారు.

# బీఆర్ఎస్‌లో వైఎస్సార్‌టీపీ విలీనం.. స్వాగతించిన మంత్రి హరీశ్ రావు



హైదరాబాద్ (వాయిస్ టుడే): వైఎస్సార్‌టీపీ పార్టీ నుంచి పలువురు నేతలు, అన్ని జిల్లా కోఆర్డినేటర్లు, కార్యకర్తలు పెద్ద ఎత్తున గట్టు రాంచందర్ రావు అధ్వర్యంలో బీఆర్ఎస్ లో చేరారు. వైఎస్సార్‌టీపీ పార్టీని బీఆర్ఎస్ పార్టీలో విలీనం చేయడానికి వచ్చిన నాయకులు, కార్యకర్తలకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్వాగతం తెలిపారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల్లో వైఎస్సార్టీపీ పోటీ చేయట్లేదని.. కాంగ్రెస్ పార్టీకి బేషరతుగా మద్దతిస్తున్నట్లు ఆ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ప్రకటించిన సంగతి తెలిసిందే. నమ్మివస్తే తమను నట్టేట ముంచిన షర్మిలపై రాజీనామా చేసిన నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆ పార్టీని బీఆర్ఎస్‌లో విలీనం చేయడానికి సిద్ధమయ్యారు. సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని తాము భావించి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు వారు స్పష్టం చేశారు.

# తుమ్మల గెలుపు నల్లేరుపై నడకే..



ఖమ్మం (వాయిస్ టుడే): ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఖమ్మం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. 30 న జరగబోయే ఎన్నికల్లో ఖమ్మం నుంచి తుమ్మల నాగేశ్వరరావు, పాలేరు నుంచి తాను, కొత్తగూడెం నుంచి కునంనేని సాంబశివరావు పోటీలో ఉన్నామని తెలిపారు. కాంగ్రెస్ శ్రేణులు అందరూ కలిసి కష్టపడి పని చేస్తేనే విజయం మనది అవుతుందన్నారు. కనిపించని శక్తి కాంగ్రెస్ కార్యకర్తలని.. ఆ శక్తితోనే అనుకున్న ఫలితాలు మనవి అవుతాయన్నారు. ఖమ్మంలో తుమ్మల నాగేశ్వరరావు గెలుపు నల్లేరుపై నడకేనని పొంగులేటి తెలిపారు. ఈ ఎన్నికల్లో 78 సీట్లు కాంగ్రెస్‌వేనన్నారు. డిసెంబర్ 9న కాంగ్రెస్ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేయనున్నారని పొంగులేటి జోస్యం చెప్పారు. తుమ్మల నాగేశ్వరరావును కార్యకర్తలు కష్టపడి గెలుపించుకోవాలన్నారు. ఖమ్మంలో డబ్బును నమ్ముకొని గెలుస్తానాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కలలు కంటున్నారన్నారు. డబ్బు గెలుస్తుందా? కార్యకర్తలను నమ్ముకున్న తుమ్మల నాగేశ్వరరావు గెలుస్తారా ..? అనేది తేలాల్సి ఉందన్నారు. డబ్బు మదంతో కేసీఆర్ విర్రవీగుతున్నారని.. ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పొంగులేటి తెలిపారు.

# ఎస్సీ వర్గీకరణను బీజేపీ భుజాన వేసుకుంది



హైదరాబాద్ (నాంపల్లి): ఎస్సీ వర్గీకరణను బీజేపీ పార్టీ భుజాన వేసుకుందని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం నాడు బీజేపీ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "మాదిగల సమస్యను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అర్థం చేసుకున్నారు. సమస్య పరిష్కారానికి ఇంతవరకు ఏ ప్రధాని చొరవ చూపలేదు. మాదిగల సమస్యకు మొదటి దోషి కాంగ్రెస్ పార్టీనే. ఉష మెహ్రా కమిటీ రిపోర్ట్‌ను కాంగ్రెస్ పార్టీ కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టింది. సమస్య పరిష్కారం అయ్యే విధంగా కేంద్రం కృషి చేస్తుంది. కేంద్రం వేసే కమిటీ వర్గీకరణ చేయాలా వద్దా అని కాదు... వేగవంతంగా అమలు చేయడం కోసమే... కమిటీ ఒక టాస్క్ ఫోర్క్. కొన్ని పార్టీలు కోడి గుడ్డు మీద ఈకలు పీకుతున్నాయి. న్యాయస్థానం తీర్పు అనుకూలంగా రాకపోతే.. చట్ట సవరణ చేస్తాం. కాంగ్రెస్ నేతలు ఈ విషయంలో ఉలిక్కి పడుతున్నారు... భయపడుతున్నారు. బీఆర్ఎస్ ఎంపీలు ఒక్కసారి కూడాప్రధానిను కలిసి ఎస్సీ వర్గీకరణపై -డిమాండ్ చేయలేదు. రెండు పార్టీల కింద భూమి కదులుతుందని భయపడుతున్నాయి. ఇది ఓట్ల కోసమో, రాజకీయాల కోసం కాదు. ఓట్లు కోసం అయితే మహిళ చట్టాన్ని ఇపుడే అమలు చేసే వాళ్లం" అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.



# కుల్కచర్లకు కృష్ణా నీళ్లు తీసుకొచ్చే బాధ్యత నాది
## మంత్రి కేటీఆర్

హైదరాబాద్ : తెలంగాణలో హనుమంతుని గుడి లేని ఊరులేదు. కేసీఆర్ సంక్షేమ పథకం అందని ఇల్లు లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా పరిగి నియోజవర్గం కుల్కచర్ల లో నిర్వహించిన రోడ్‌షోకు ప్రజలు భారీగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కకిరి సన్నబియ్యం అందజేస్తామన్నారు. రైతుల కోసం అనే పథకాలు ప్రవేశపెట్టాం. 75 లక్షల మంది రైతులకు రూ.73 వేల కోట్లు రైతుబీమా అందిచామన్నారు.


రైతు చనిపోతే వారం రోజుల్లోనే రైతుబీమా రూ.5 లక్షలు వారం రోజుల్లోనే బాధిత కుటుంబానికి అందిస్తున్నామని స్పష్టం చేశారు. మూడోసారి అధికారంలోకి వచ్చాక సౌభాగ్య లక్ష్మి పథకం కింద అర్హులైన ప్రతి ఆడిబిడ్డకు మూడు వేలు ఇస్తామన్నారు. అలాగే దళితులు, గిరిజనులకు అసైన్డ్ భూములపై సంపూర్ణ హక్కులు కల్పిస్తం. తండాలను గ్రామ పంచాయతీలను చేశామని పేర్కొన్నారు. గిరిజనులకు 6 శాతం నుంచి 12 శాతం రిజర్వేషన్లు పెంచామని, ప్రతి తండాలో సేవాల్ మహరాజ్ భవనాలు కట్టిస్తామని హామీనిచ్చారు.

### భారీగా హాజరైన జనం..

కుల్కచర్లకు కృష్ణా నీళ్లు తీసుకొచ్చే బాధ్యత నాది అని హామీనిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ధరణి తీసేస్తామని చెబుతున్నారు. ధరణి తీసేస్తే రైతుల భూములు దళారుల చేతుల్లోకి పోతాయన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కరెంట్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గతంలో కరెంట్ ఎలా ఉంది. ఇప్పుడు ఇలా ఉందో ఆలోచన చేయాలన్నారు. తెలంగాణ వచ్చినప్పుడు నీళ్లు, లేవు కరెంట్ లేదు. ఆర్థిక క్రమశిక్షణతో అన్ని చక్కదిద్దుకున్నాం. డిసెంబర్ 3 తర్వాత కొత్త పథకం తీసుకొస్తామని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న పరిగి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.



# ఢిల్లీలో మరింత తీవ్రంగా ఎయిర్ పొల్యూషన్.. సుప్రీంకోర్టు ఆదేశాలు భేఖాతర్



న్యూఢిల్లీ: ఢిల్లీ వాయు కాలుష్యం మరింత తీవ్రమైంది. దీపావళి పండుగ సందర్భంగా ఢిల్లీ వాసులు పోటీపడి పటాకులు కాల్చడంతో పొల్యూషన్ పెరిగింది. నగరంలో వాహనాల రద్దీ పెరగడం, పంజాబ్‌లో పంట వ్యర్థాల కాల్చివేత కారణంగా ఢిల్లీలో గత కొన్ని రోజులుగా ఎయిర్ పొల్యూషన్ పెరుగుతూ వస్తున్నది. ఈ నేపథ్యంలో దీపావళి పండుగనాడు పటాకులు కాలిస్తే కాలుష్యం మరింత తీవ్రమవుతుందనే ఉద్దేశంతో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. పండుగరోజు ఢిల్లీ నగరంలో పటాకులు కాల్చడంపై నిషేధం విధించింది.

అయితే, సుప్రీంకోర్టు నిషేధాజ్ఞలను ఢిల్లీ వాసులు భేఖాతర్ చేశారు. దీపావళి రోజు రాత్రి యథేచ్ఛగా పోటీపడి పటాకులు కాల్చారు. దాంతో ఇవాళ ఉదయం ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్, చుట్టు పక్కల ప్రాంతాల్లో ఎయిర్ పొల్యూషన్ ప్రమాదకర స్థాయికి చేరుకుంది. నగరంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ సగటు 286కు చేరింది. ఢిల్లీ యూనివర్సిటీ, ఐఐటీ ఢిల్లీ, ఎయిర్‌పోర్టు ప్రాంతాల్లో ఏక్యూఐ 300 దాటింది. ఇతర ప్రాంతాల్లో కొంత తక్కువగా ఉన్నది. ఆదివారం రాత్రి పటాకులు కాల్చడంతో సోమవారం ఉదయం ఢిల్లీలోని పలు ప్రాంతాలపై దట్టమైన విషపూరిత పొగమంచు కమ్మింది. పండుగరోజైన ఆదివారం ఉదయం 202గా ఉన్న ఢిల్లీ యావరేజ్ ఏక్యూఐ, ఇవాళ ఉదయం 286కు పెరిగింది. రహదారులపై కమ్ముకున్న దుమ్ముధూళి కారణంగా విజుబిలిటీ బాగా తగ్గిపోయింది. 50 మీటర్ల దూరం కూడా కనిపించక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.